# పాశుపతం

(మరికొన్ని కథలు)

---

గోవిందరాజు రామకృష్ణారావు

ఎమెస్కో

**కథాక్రమం బెట్టిదనిన.....**


| | | |
|---|---|---|
| 1. | ధర్మో రక్షతి రక్షితః | 5 |
| 2. | అవరోహణ | 12 |
| 3. | బొమ్మ – బొరుసు | 17 |
| 4. | పల్లె మారింది | 23 |
| 5. | మల్లిక | 28 |
| 6. | శుభవార్త | 36 |
| 7. | పాశుపతం | 44 |
| 8. | ఇల్లంతా సందడి | 50 |
| 9. | యమ దర్శనం | 55 |
| 10. | శ్రవణం | 63 |
| 11. | అతిథి | 70 |

# ధర్మో రక్షతి రక్షితః

"ఎస్సై వున్నాడా..' ఫోన్లో అవతల పక్క కంచు మోగింది.

హెడ్డు బిత్తర పోయాడు. మహా మహా వాళ్ళే చంద్రంపూడి పోలీసుస్టేషనంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని మాట్లాడతారు. మామూలు కానిస్టేబులికి కూడా "గారు" తగిలించాలి. అది రివాజు.

అలాంటప్పుడు ఏకంగా ఎస్సైనే "వున్నాడా" అనగల మొనగా డెవడబ్బా అనుకున్నాడు హెడ్డు.

ఇంద్ర భవనం రామచంద్రయ్య తప్ప మరో శాల్తీ తట్టడం లేదు. "ఆయనెందుకు చేస్తాడు?" హెడ్డు ఆలోచన్లో పడి వెంటనే జవాబివ్వ లేదు.

"ఎవరక్కడ.... వినపట్లేదా?" కంఠం కసురుకుంది.

రామచంద్రయ్య కంఠం గుర్తు పట్టి హెడ్డు ఖంగుతిన్నాడు.

"సార్సార్..... నమస్కారం సార్. నేను హెడ్డుని సార్!"

"ఎస్సై యేమయ్యాడు?" తీవ్రంగా వచ్చింది ప్రశ్న అటు వైపు నుంచి.

"ఈ పొద్దున వూరెళ్ళారు సార్..... సాయంత్రానికి వచ్చేస్తామన్నారు...... వచ్చే టైమయింది సార్." హెడ్డు వినయంగా సంజాయిషీ చెప్పుకున్నాడు.

"ఈ వూరొచ్చి పట్టుమని పది రోజులు కాలేదు. అప్పుడే చెక్కేశారా.... ఎక్కడికి?" కోపం, డబాయింపు కలిశాయి."

"వాళ్ళ నాన్నగారికి సుస్తీగా వుందని కబురొచ్చింది సార్. ఒక్కరే వెళ్ళారు సార్. వచ్చే టైమయింది సార్."